

రేపు జిల్లాలో ట్రాఫిక్ ఆంక్షలు



శ్రీకాకుళం : ఈనెల 12న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటన నేపథ్యంలో జిల్లాలో ట్రాఫిక్ ఆంక్షలు అమలవుతాయని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. వివిఐపి భద్రత, ప్రధాని పర్యటనకు ఆటంకం లేకుండా 12న వేకువజామున 3 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు శ్రీకాకుళం నుంచి జాతీయ రహదారిపై అనకాపల్లి వైపు వెళ్లే భారీ, ఇతర రవాణా వాహనాల రాకపోకలను నిలిపివేయనున్నట్లు తెలిపారు. అత్యవసర సేవలు, ప్రధాని సభాస్థలికి వెళ్లే వాహనాలకు మినహాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు.

'బోరు'మంటున్న రైతులు

- వైఎస్సార్ జలకళ పథకం ఖర్చుపై పరిమితి విధింపు
- రూ.రెండు లక్షలు దాటితే రైతుపైనే భారం
- ఇప్పటివరకు బోర్లు తవ్వింది 239 చోట్లే
- తవ్వకాలపై పునరాలోచనలో అన్నదాతలు



జిల్లాలో సాగునీటి సౌకర్యం లేక వేలాది ఎకరాల భూములు నిరుపయోగంగానే ఉన్నాయి. ఆ భూముల్లో ఉచితంగా బోర్లు వేసి వాటిని వినియోగంలో తీసుకొస్తామంటూ వైసిపి ప్రభుత్వం రెండేళ్ల కిందట వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రవేశపెట్టింది. బోర్లతో పాటు విద్యుత్ కనెక్షన్లూ అందిస్తామని చెప్పడంతో రైతులు ఉత్సాహంగా దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ, సర్వే పూర్తి చేసి అర్హులైన వారికి అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్న తరుణంలో ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో అన్నదాతల ఉత్సాహంపై నీళ్లు చల్లినట్లయింది. విద్యుత్ కనెక్షన్ల ఖర్చు నిర్ణీత మొత్తం కంటే దాటితే రైతులే భరించాలని ప్రభుత్వం చెప్పడంతో రైతులు ఉసూరుమంటున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

చిన్న, సన్నకారు రైతులకు మేలు కలిగించేందుకు వైసిపి ప్రభుత్వం సెప్టెంబర్ 28, 2020లో వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రారంభించింది. బోరు సౌకర్యం లేని 2.5 ఎకరాల నుంచి ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులను అర్హులుగా పేర్కొంది. బోర్ల తవ్వకం, విద్యుత్ కనెక్షన్లను ఉచితంగా ఇస్తామంటూ ప్రకటించింది. ప్రస్తుతం అందులో మార్పులు చేయడంతో అన్నదాతలు ఉసూరుమంటున్నారు. ఐదెకరాల్లోపు వారికి సైతం రూ.రెండు లక్షల్లోపు మాత్రమే విద్యుత్ కనెక్షన్ల ఖర్చు చేస్తామని, అంతకంటే ఎక్కువైతే రైతులే భరించాల్సి ఉంటుందని పేర్కొంది. ఇప్పటివరకు వేసిన వాటికి యథాతథంగా డబ్బులు చెల్లించనున్నట్లు తెలిసింది. ఇకపై కనెక్షన్లకు రైతులే చెల్లించాల్సి ఉంటుందని తెలుస్తోంది. దీంతో ఇన్నాళ్లు ఉచిత విద్యుత్ కనెక్షన్లు వస్తాయని ఎదురుచూస్తున్న రైతులకు షాక్ ఇచ్చినట్లయింది. దరఖాస్తుదారుల్లో ఐదు ఎకరాల్లోపు ఉన్న వారే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన ప్రకారమైతే, వీరందరికీ ఉచితంగా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. రాయితీని రూ.రెండు లక్షలకే పరిమితం చేయడంతో, వందల సంఖ్యలోనే రైతులు అర్హత సాధించే పరిస్థితి నెలకొంది.

13 చోట్లే విద్యుత్ కనెక్షన్లు

జిల్లాలో వైఎస్సార్ జలకళ పథకం కోసం మొత్తం 5,690 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 4,688 దరఖాస్తులు అర్హమైనవిగా తేల్చారు. వాటిలో 2,299 చోట్ల సర్వే పూర్తి చేశారు. సర్వే పూర్తయిన వాటిలో 1057 ప్రాంతాల్లో బోర్ల తవ్వకాలకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటివరకు 239 చోట్ల బోర్లు తవ్వారు. 13 మంది రైతుల పొలాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.

> **ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా...**
>
> జలకళ పథకానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు బోర్లను మంజూరు చేస్తున్నాం. ఇప్పటివరకు ప్రభుత్వ ఖర్చుతోనే బోర్ల తవ్వకం, విద్యుత్ కనెక్షన్లు ఇచ్చాం. బోర్ల తవ్వకం, విద్యుత్ కనెక్షన్లకు అయ్యే ఖర్చు విషయంలో ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. అంతవరకు విద్యుత్ కనెక్షన్లను పెండింగ్‌లో పెట్టాలని ప్రభుత్వం సూచించింది. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా చర్యలు చేపడతాం.
>
> **- జి.వి చిట్టిరాజు, డ్వామా పీడీ**

లక్ష్యానికి ఆమడదూరంలో...

చిన్న, సన్నకారు రైతులను ఆదుకునేందుకు గతంలో ఇందిర జలప్రభ, ఎన్టీఆర్ జలసిరి పేర్లతో గత ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేశాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని మార్పులు చేసి వైఎస్సార్ జలకళగా పేరు మార్చింది. బోర్లు, విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించడంతో రైతులు ఆశతో దరఖాస్తు చేసుకున్నారు.

ప్రారంభం నుంచి పలు నిబంధనలు మార్చడం, గిట్టుబాటు కాక డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు రాకపోవడం, నిధుల లేమి, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం తదితర కారణాలతో పురోగతి కనిపించడం లేదు. జిల్లాలో ఎచ్చెర్ల, ఆమదాలవలస, పలాస నియోజకవర్గాల్లో మాత్రమే బోర్ల తవ్వకాలకు డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు వచ్చాయి. ప్రభుత్వం చెల్లిస్తున్న ధర గిట్టుబాటు కావడం లేదంటూ మిగిలిన నియోజకవర్గాల్లో ఏజెన్సీలు ఆసక్తి చూపడం లేదు. వేల మంది రైతులు దరఖాస్తు చేసుకుంటే, ఈ రెండేళ్లలో వందల సంఖ్యలోనే బోర్లు తవ్వారు. పదుల సంఖ్యలోనే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.

ఖర్చు పెరగడంతో రైతులు వెనకడుగు

సాధారణంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్, నాలుగు విద్యుత్ స్తంభాలు వేస్తే రూ.రెండు లక్షల అంచనా వ్యయం దాటిపోతుందని అధికారులు చెప్తుండడంతో, బోర్లు వేయించుకునేందుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. లబ్ధిదారుల్లో ఎక్కువ మంది ఒకటి నుంచి రెండు కిలోమీటర్ల మేర స్తంభాలు వేయాల్సిన వారు ఉన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో కలిపితే వారికి రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షలు దాటిపోతోంది.

ఇప్పటికే 13 బోర్లకు కనెక్షన్లు ఇచ్చారు. వాటిలో రూ.రెండు లక్షలకు పైబడినవి ఉన్నా ఉచితంగానే లబ్ధి చేకూర్చారు. పథకం మధ్యలో ప్రభుత్వం అందిస్తున్న సాయానికి పరిమితి విధించడంతో రూ.లక్షలు పెట్టుబడి పెట్టాల్సి రావడంతో రైతులు విముఖత కనబరుస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే సాయం ఎటూ సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

రాష్ట్రానికి బిజెపి అన్యాయం

- విభజన హామీల ఊసే లేదు
- రాష్ట్ర ప్రజల తరుపున ప్రధానిని ప్రశ్నించాలి
- మోడీ విశాఖ పర్యటనకు వ్యతిరేకంగా నేడు, రేపు నల్ల జెండాలతో నిరసనలు
- వామపక్షాల నాయకుల వెల్లడి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ విమర్శించారు. నగరంలోని సుందరయ్య భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటనకు నిరసనగా ఈనెల 11, 12 తేదీల్లో జిల్లావ్యాప్తంగా నల్ల జెండాలతో నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. వీటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విభజన చట్టం ప్రకారం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు ఊసే లేదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిస్తే ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. 700 రోజులుగా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు ఆందోళన చేస్తుంటే కనీసం పట్టడం లేదన్నారు. నిరసన తెలిపేందుకూ అవకాశం ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని వైసిపి నాయకులు ప్రధానిని ప్రశ్నించాలని కోరారు.

కొవ్వాడ అణుపార్కు రద్దుపై ప్రకటన చేయాలి

వినాశకర కొవ్వాడ అణుపార్కును రద్దు చేస్తున్నట్లు విశాఖపట్నంలో ప్రధానమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కొవ్వాడ అణుపార్కు ఉత్తరాంధ్రకు మరణశాసనమన్నారు. అమెరికా షరతులకు లోబడి కొవ్వాడలో అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయడానికి బిజెపి ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అణుపార్కు రద్దు చేయాలని శాసనసభలో తీర్మానం చేయాలన్నారు. కొవ్వాడలో అణుపార్కు ఏర్పాటుపై వైసిపి, టిడిపి ఎందుకు మాట్లాడం లేదని ప్రశ్నించారు. గుజరాత్ రాష్ట్రంలోని మితివిర్థిలో పెట్టాల్సిన అణువిద్యుత్ కేంద్రాన్ని అక్కడి రైతులు, ప్రజలు వ్యతిరేకించడంతో బిజెపి ప్రభుత్వం కొవ్వాడకు తరలించిందని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, జర్మనీ, జపాన్ అణువిద్యుత్ కేంద్రాలను మూసివేస్తున్నాయని గుర్తు చేశారు. 1979లో అమెరికా త్రీమైల్ ఐలాండ్‌లోని అణు ప్రమాదం సంభవించిన తర్వాత కొత్తగా ఏర్పాటు చేయలేదని చెప్పారు. దివాళా తీసిన వెస్టింగ్‌హౌస్ కంపెనీతో కలిసి రూ.లక్షల కోట్ల ప్రజాధనంతో ఒకే చోట ఆరు అణు రియాక్టర్లు పెట్టడం దేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రజల ప్రాణాలకు పెను ప్రమాదమని హెచ్చరించారు. అత్యంత ప్రమాదకరమైన, ఖరీదైన అణు విద్యుత్ కేంద్రం అవసరం లేదని, అందుకు ప్రత్యామ్నాయాలు ఉన్నాయని తెలిపారు.

మీరు కాదన్నా భూసేకరణ తప్పదు

రైతులకు తహశీల్దార్ చలమయ్య హెచ్చరిక

ప్రజాశక్తి - నౌపడ



రైతుల పేర్లు చదివి వినిపిస్తున్న విఆర్‌ఒ

భావనపాడు పోర్టు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ కాలనీ కోసం భూములు త్యాగం చేసేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, రాకపోయినా భూసేకరణ తప్పదని తహశీల్దార్ చలమయ్య అన్నారు. నౌపడ రెవెన్యూ గ్రూపు పరిధిలోని సుమారు 30 సర్వే నంబర్లలోని రైతులతో నౌపడ సచివాలయంలో సర్పంచ్ ప్రతినిధి పిలక రవికుమర్ రెడ్డి ఆధ్వర్యాన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలపేట, విష్ణుచక్రం గ్రామస్తుల పునరావాసం నిమిత్తం నౌపడలో సుమారు 70 మంది రైతులకు చెందిన భూములు అవసరమయ్యాయని తెలిపారు. ఆర్ అండ్ ఆర్ కాలనీ కోసం 52 ఎకరాలను సేకరించనున్నట్లు చెప్పారు. ఆయా సర్వే నంబర్లలోని రైతుల పేర్లు చదివి వినిపించారు. దీంతోపాటు రహదారి నిర్మాణానికి మరో 39 ఎకరాలు అవసరమని తెలిపారు. ఏ పరిహారం కావాలో తెలియజేయాలని రైతులను కోరారు.

దీనిపై రైతులు వ్యతిరేకత వ్యక్తం చేశారు. తమకున్న కొద్దిపాటి భూములను భూసేకరణ పేరుతో తీసుకుంటే తాము ఎలా బతకాలని ప్రశ్నించారు. వేరేచోట స్థల సేకరణ చేయాలని కోరారు. ఈ భూముల జోలికి రాకుండా ఉప్పు భూములు, ఇతర ప్రభుత్వ భూములు చాలా ఉన్నాయని, వాటిని తీసుకోవాలని కోరారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ మీరు ఒప్పుకుంటే ఒకలా ఉంటుందని లేదంటే మరోలా ఉంటుందని హెచ్చరించారు. మీ అభ్యర్థనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, మరోసారి సమావేశమవుతామని చెప్పారు. సమావేశంలో ఉప సర్పంచ్ రవి, మాజీ సర్పంచ్ విష్ణుమూర్తి, విఆర్‌ఒ ప్రసాద్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా మార్టులతో సుస్థిర ఆదాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు సభ్యులకు సుస్థిర ఆదాయాలు వచ్చేలా మంచి ప్రాజెక్టులను నెలకొల్పాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది సూచించారు. ఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్, పిఎంజిఎస్‌వై, సెర్ప్ తదితర అంశాలపై గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలోని మహిళా సంఘాల ద్వారా తొలి దశలో ప్రతి మండలంలో రెండు మహిళా మార్టులను ఏర్పాటు చేయాలన్నారు. రెండో దశలో జిల్లావ్యాప్తంగా 600 వరకు మహిళా మార్టులను ఏర్పాటు చేసి మహిళలకు సుస్థిర ఆదాయం వచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ మార్టుల ద్వారా ఐదారు వేల మందికి ఉపాధి లభించేందుకు దోహదపడాలన్నారు. ప్రస్తుతం అన్ని పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్నాయని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసి ప్రతిపాదనలను పంపాలన్నారు. ప్రాధాన్యతా భవన నిర్మాణాలైన రైతుభరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్, డిజిటల్ లైబ్రరీలు నిర్మాణ సమస్యలున్న చోట రీవెరిఫికేషన్ చేసి అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు డి.వి విద్యాసాగర్, జి.వి చిట్టిరాజు, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, సర్వే, భూ రికార్డుల శాఖ సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి తదితరులు

సుడిదోమ సోకినా చలనం లేదు

- ఎకరాకు రూ.30వేలు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి
- టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - పొందూరు / ఆమదాలవలస

జిల్లాలో లక్ష ఎకరాల వరకు వరి పంటకు సుడిదోమ సోకినా ప్రభుత్వంలో కనీస చలనం లేదని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు ఇన్‌పుట్ సబ్సిడీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. పొందూరు మండలంలోని కింతలి, సింగూరు, ఆమదాలవలస మండలంలోని కొర్లకోటలో సుడిదోమ సోకడం వల్ల పాడైన వరి పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో వరి పంటకు సుడిదోమ సోకగా ఒక్క ఆమదాలవలస నియోజకవర్గంలోనే సుమారు 20 వేల ఎకరాల్లో రైతులు పంట నష్టపోయారని తెలిపారు. సుడిదోమ కారణంగా నష్టపోయిన పంటలను వ్యవసాయ అధికారులు నమోదు చేయాలన్నారు. 2014లో టెక్కలి, పలాస, నరసన్నపేటలో దోమపోటు వల్ల 70 వేల ఎకరాల్లో పంట నష్టపోతే అప్పటి టిడిపి ప్రభుత్వం రైతులను ఆదుకుందని చెప్పారు. అదేవిధంగా సుడిదోమ వల్ల నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర లేకపోవడంతో కుదేలైపోతున్నారని చెప్పారు. రైతులు నష్టపోతున్న అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారిని ఏవిధంగా ఆదుకోవాలన్న కనీస ఆలోచన జిల్లాలోని ఇద్దరు మంత్రులు, స్పీకర్, అధికార పార్టీ ఎమ్మెల్యేలకు లేకుండా పోయిందని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సీపాన శ్రీరంగనాయకులు, సనపల ఢిల్లేశ్వరరావు, నూకరాజు, కింతలి సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసిలు కూటికుప్పల హనుమంతురావు, మొదలవలస సీతారామారావు, అన్నెపు భాస్కరరావు, కొర్లకోట సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



కింతలిలో సుడిదోమ సోకిన వరి పంటను పరిశీలిస్తున్న రవికుమార్

బిఎంసియుల నిర్మాణం వేగవంతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పాల ఉత్పత్తిని పెంచడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ పి.ఎస్ ప్రద్యుమ్న అన్నారు. అందులో భాగంగా నిర్మిస్తున్న బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్స్, ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్స్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. జిల్లా ఉన్నతాధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ నిర్మాణం పూర్తయిన చోట అవసరమైన పరికరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. నిర్మాణానికి అవసరమైన స్థలాలు వివాదంలో ఉంటే తక్షణమే వాటిని పరిష్కరించడం గానీ, ప్రత్యామ్నాయ స్థలాలు సేకరించి నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్స్‌ను గొడౌన్ల తరహాలో నిర్మించాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలు ఇప్పటికే చివరి దశకు చేరుకున్నాయన్నారు. మిగిలిన నిర్మాణాలను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి ఎస్.సుబ్బారావు, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి కాళేశ్వరరావు, డిసిసిబి సిఇఒ డి.వరప్రసాద్, పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు ఎం.కిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాలను సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో చేపడుతున్న రీ సర్వేని పూర్తి చేసి భూ హక్కు - భూ రక్ష పత్రాల జారీకి సిద్ధం చేయాలని భూ పరిపాలన శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆదేశించారు. రీ సర్వే, భూహక్కు - భూ రక్ష పత్రాల మంజూరుపై గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సమగ్ర సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ హక్కుదారులకు పత్రాల జారీకి చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించిన ముసాయిదాను తొలుత ప్రచురించాలన్నారు. ప్రచురించిన ముసాయిదాపై కలెక్టర్లు నాలుగైదు రోజుల పాటు నిశితంగా పరిశీలించి, మార్పులు, చేర్పుల జాబితాను సరిచేసిన తర్వాత తుది జాబితాను తమకు పంపాలన్నారు. ఆ జాబితా ఆధారంగా భూహక్కు- భూరక్ష పత్రాలు సిద్ధం అవుతాయన్నారు. భూహక్కు పత్రాల్లో ప్రచురణే కొలమానం కానుందని, అందువల్ల తప్పులకు అవకాశం లేకుండా నిశితంగా పరిశీలన చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ నవీన్, డిఆర్‌ఒ ఎం.రాజేశ్వరి, భూసర్వే, రికార్డుల శాఖ ఎడి కె.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానంలోని పిహెచ్‌సిల్లో ఎనలైజర్లు

శ్రీకాకుళం అర్బన్ : ఉద్దానం ప్రాంతంలోని 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎనలైజర్లు తప్పక అందుబాటులో ఉంచాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. ఎనలైజర్లు లేని ఆస్పత్రుల వివరాలను తక్షణమే అందజేయాలన్నారు. ఉద్దాన ప్రాంత వైద్య సేవలపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత వైద్యాధికారులతో గురువారం సమీక్షించారు. జిల్లాకు ఎనలైజర్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, అందులో ఉద్దానం ప్రాంతంలోని 18 పిహెచ్‌సిలకు గానూ 13 పిహెచ్‌సిలకు ఎనలైజర్లను సమకూర్చామన్నారు. మిగిలిన ఐదు చోట్ల ఏర్పాటు చేసిన తర్వాత జిల్లాలోని ఇతర పిహెచ్‌సిల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గత సమావేశంలో ఎనలైజర్లు మాత్రమే కావాలని వైద్యులు కోరారని, ప్రస్తుతం ఎనలైజర్లతో పాటు సెంట్రిఫ్యూజ్ లేనిదే వాటి ఉపయోగం ఉండదని చెప్పడం సరికాదన్నారు. గతేడాది నుంచి ఎనలైజర్లు పనిచేయడం లేదనే నెపంతో కిడ్నీ రోగులను వెనక్కి పంపడం వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పిహెచ్‌సి స్థాయిలో కిడ్నీ బాధితులకు డయాలసిస్ చేసేందుకు గల అవకాశాలను పరిశీలించి తెలియజేస్తే, అక్కడ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీనిచ్చారు. ఇప్పటికే ఎనలైజర్లు ఉన్నాయని, వైద్యులు సెంట్రిఫ్యూజ్ కోరిన తర్వాత వాటిని మంజూరు చేస్తామన్నారు. నెఫ్రాలజిస్టులు ప్రతి వారం రెండు పిహెచ్‌సిలు సందర్శించాలని స్పష్టం చేశారు. ప్రతి గృహాన్ని సందర్శించి రోగి ఇంటి వద్దే వైద్యాన్ని అందించాల్సిన అవసరం ఉందేమో పరిశీలించాలని సూచించారు. వారంలో మందులు అన్ని పిహెచ్‌సిలకు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి జె.భాస్కరరావును ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, నెఫ్రాలజిస్ట్ కె.విద్యాసాగర్, ఉద్దానం ప్రాంత పిహెచ్‌సిల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

అరసవల్లి హుండీ ఆదాయం రూ.49.89 లక్షలు

శ్రీకాకుళం అర్బన్ : రెండు నెలల వ్యవధిలో అరసవల్లి సూర్యనారాయణ స్వామి హుండీ ఆదాయం రూ.49,89,181 సమకూరింది. అందులో కరెన్సీ నోట్ల రూపంలో రూ.47,84,788, చిల్లర రూపంలో రూ.2,04,393 సమకూరింది. వీటితో పాటు 106 అమెరికన్ డాలర్లు, 41.500 గ్రాముల బంగారం, రెండు కిలోల వెండి సమకూరింది. ఆలయ ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో గురువారం హుండీని లెక్కించారు. ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్, దేవాదాయశాఖ సూపరింటెండెంట్ బి.వి.వి.ఆర్ పట్నాయక్, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, వంశపారంపర్య ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు తదితరులు పర్యవేక్షించారు.

వృత్తి నైపుణ్యంతో ఉన్నత స్థాయి

శ్రీకాకుళం : మహిళలు వృత్తి నైపుణ్యాలు పెంచుకుని అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి చేరాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తాల గోపి అన్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో పొదుపు సంఘాల రీసోర్స్‌పర్సన్ మహిళలకు న్యాయ అవగాహనా సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత వల్ల అన్ని రంగాల్లో మహిళలు వృద్ధి చెందుతున్నారని చెప్పారు. సమాజంలో అసాంఘిక శక్తుల వల్ల ఇబ్బందుల పాలవకుండా అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి గోపి

కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్, పొదుపు సంఘాల రీసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం అర్బన్ : పార్లమెంట్ అభివృద్ధి పథకం నిధుల కింద అన్ని ప్రాంతాలకు కేటాయిస్తున్న నిధులతో సకాలంలో పనులు చేపట్టి ప్రగతిబాటలో జిల్లా పయనించేందుకు కృషి చేయాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎంపీ లాడ్స్ వినియోగంపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గడిచిన ఐదేళ్లలో రూ.25 కోట్లతో 345 పనులు చేపట్టామని స్పష్టం చేశారు. రానున్న రెండేళ్లలో మరో రూ.10 కోట్లతో పలు అభివృద్ధి పనులు శరవేగంగా చేయించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

పలు శాఖలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు సంపూర్ణ సహకారాన్ని అందిస్తూ, ఎంపీ నిధుల వినియోగంలో శ్రద్ధ, చొరవ చూపాలని కోరారు. ఎంపీ నిధులు సకాలంలో వ్యయం చేయడంలో సీతంపేట ఐటిడిఎ గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం ప్రథమ స్థానంలో ఉందన్నారు. మందస మండలంలో కొందరు రాజకీయ నాయకులు ఎంపీ నిధుల వినియోగంలో అడ్డు తగులుతున్నారని చెప్పారు. ఇకనైనా ప్రగతి పనులకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో సిపిఒ ప్రసన్నలక్ష్మి, పలు ఇంజినీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

ఆక్వా రైతులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ఇచ్ఛాపురం నియోజకవర్గం సోంపేట మండలం ఉప్పలాం పంచాయతీ బట్టిగళ్లూరులో ఉన్న ఆక్వా రైతులను ఆదుకోవాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతంలో ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు టిడిపి ప్రభుత్వం ఎంతో ప్రోత్సహించిందన్నారు. ఈ మూడున్నరేళ్లలో ఆక్వా రైతులకు ఎటువంటి ప్రోత్సాహకాలు అందకపోవడం, వాతావరణం అనుకూలించకపోవడంతో తీవ్రంగా నష్టపోయారని వివరించారు. తక్షణమే ఆక్వా రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.


పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజా సంక్షేమమే ధ్యేయం

పోలాకి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పరిపాలన అందిస్తున్నామని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని పల్లిపేట పంచాయతీలో పల్లిపేటలో 72వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ... పోస్టర్లను అందజేశారు. అలాగే ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైసిపి సిఇసి రాష్ట్ర మెంబర్ ధర్మాన పద్మప్రియ, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ ప్రతినిధి బూస రమణారెడ్డి, జడూరు, నాయకులు చితపాన లక్ష్మీనారాయణ, చింతాడ ఉమా, ఆర్.త్రినాథరావు పాల్గొన్నారు.


కషాయం తయారీ చేస్తున్న సభ్యులు

కషాయం తయారీ

సంతబొమ్మాళి: తూటికాడ కషాయంతో సుడిదోమ నివారణ చేయవచ్చునని ప్రకృతి వ్యవసాయం సంఘ సభ్యులు సింహాచలం అన్నారు. మండలంలోని లక్ష్మీపురం క్లస్టర్ సవరపేట, గోవిందపురం, లక్ష్మీపురం గ్రామాల్లో దండాశమ్మ అనే రైతుతో వంద లీటర్ల నీమాస్త్రాన్ని గురువారం తయారు చేయించారు. అలాగే కాపుగొదయ్యవలసలో మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి తూటికాడ కషాయం వల్ల లాభాలు వివరించారు. సంఘ సభ్యులు తంగి వేణమ్మ, కింజరాపు ఉష పాల్గొన్నారు.

సాగునీటి కష్టాలు

- వంశధార నుంచి సరఫరా కాని సాగునీరు
- మోటార్లతో నీటిని పెడుతున్న రైతులు


నీటి తడి లేని వరి పంట

ప్రజాశక్తి- పలాస

ఆరుగాలం శ్రమించిన రైతన్నకు ఖరీఫ్ కష్టాలు తప్పడం లేదు. వర్షం కురవక, వంశధార అందక రైతులు సతమతమవుతున్నారు. పొట్ట దశలో సాగునీరు అవసరం కావడంతో నీరు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు పెట్టుబడులు పెట్టి ఆకాశానికి, వంశధార కాలువ వైపు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో సుమారు 10,305 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ఎకరాకు సుమారు రూ.20 వేలు వరకు పెట్టుబడులు పెట్టారు. ఈ ఏడాది ఉబాలు వేయడం ఆలస్యం అయినా కురిసిన వర్షాలు, వరద నీరు, అడపాదడపా సరఫరా అయినా వంశధార సాగునీటితో రైతులు ఖరీఫ్ పనులు మొదలుపెట్టారు. ఇదిలా ఉండగా ఖరీఫ్ నుంచి ఇప్పటి వరకు పంటలకు ఎటువంటి ఇబ్బందులు లేనప్పటికీ ప్రస్తుతం పంట పొలాలు పాలు పోసే దశ, పొట్ట దశ, గింజ కట్టే దశలో ఉన్నాయి. గింజ కట్టే దశలో అంతంతమాత్రంగా నీరు అవసరం కాగా, పొట్ట, పాలు పోసే దశల్లో తప్పనిసరిగా సాగునీరు పెట్టాలి. కాని, అందుబాటులో సాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు.

అందని ద్రాక్ష వంశధార

ఏటా వంశధార కాలువ ఉందని చెప్పడానికే తప్ప పంట భూములకు సాగునీరు అందని ద్రాక్షగా మారింది. ఖరీఫ్ మొదలుకుని పంట కోత సమయం వరకూ వంశధార వస్తుందా? లేదా? తెలియని పరిస్థితి. కాని, రైతుల నుంచి ప్రభుత్వం నీటి తీరువ వసూలు చేస్తున్నారే తప్ప సాగునీరు అందించడంలో అధికారులు, పాలకులు విఫలమవుతున్నారని చెప్పాలి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పంట భూములకు సాగునీరు తప్పనిసరి. కానీ, నెల రోజులుగా వర్షాలు కురవక మరోవైపు మొసగాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట భూములు ఇప్పటికే తడి ఆరి బీడు భూములుగా మారే పరిస్థితి నెలకొంటుంది. ఈ సమయంలో సాగునీరు అందకపోతే దిగుబడి బాగా తగ్గిపోతుందని రైతులు చెబుతున్నారు. కొంతమంది రైతులు మోటారు సహాయంతో పంట భూములను నీరు పెడుతున్నారు. గంటకు రూ.వెయ్యి చొప్పున చెల్లిస్తున్నామని రైతులు అంటున్నారు. ఇలా ఏటా వ్యవసాయం చేయడం కష్టంగా మారుతుందని, అయినా సరే తప్పనిసరి పరిస్థితుల్లో వ్యవసాయం చేస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో వంశధార కేవలం ఒకటి, రెండుసార్లు మాత్రమే నీరు సరఫరా చేశామని వంశధార అధికారులు చెబుతున్నారు. ఏదేమైనప్పటికీ వరుడు కరుణించకపోగా, మరో వైపు వంశధార అందక ఏం చేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై వంశధార ఎఇఇ ప్రేమ్ కుమార్‌ను వివరణ కోరగా, మరో మూడు రోజుల్లో వంశధార శివారు భూములకు సాగునీరు అందేలా చూస్తామన్నారు. పంటలకు సాగునీరు అవసరమని రైతులు విన్నపాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఇదే విషయాన్ని పలాస వ్యవసాయ శాఖ ఎఒ పోలారావును వివరణ కోరగా, ప్రస్తుతం పంట పొలాలకు ఒకటి, రెండుసార్లు నీరు పెడితే సరిపోతుందన్నారు. నీరు సకాలంలో పెట్టకపోతే దిగుబడి తగ్గే అవకాశం ఉందని చెప్పారు.


మోటారు సాయంతో నీరు పెడుతున్న రైతు


నీరు లేక వంశధార కాలువ దుస్థితి

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస


శ్యామలరావు (ఫైల్)

మండలంలోని లక్ష్మీపురం టోల్ గేట్ సమీపంలో కాశీబుగ్గకు చెందిన సిహెచ్.శ్యామలరావు (70) గురువారం రాత్రి రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న లారీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు గతంలో పోస్టాఫీసులో పనిచేసి ప్రారంభంలోనే ఉద్యోగానికి రాజీనామా చేశారు. పలాస-కాశీబుగ్గ తెలగ సంఘం గౌరవ అధ్యక్షులుగా కొన్నాళ్ల పాటు పనిచేస్తున్నారు. మృతుడుకు భార్య నీలవేణి, కుమారుడు కిరణ్, కుమార్తె రాణి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురికి గాయాలు

కోటబొమ్మాళి : మండలంలోని కొత్తపల్లి గ్రామ సమీపంలో గురువారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఆదే గ్రామానికి చెందిన బోయిన రమేష్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. రమేష్ తన భార్యతో ద్విచక్ర వాహనంపై కోటబొమ్మాళి వైపు వస్తుండగా... కోటబొమ్మాళి నుంచి ఎదురుగా వెళ్తున్న ఆటో ఢీకొంది. స్థానికులు క్షతగాత్రులను కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యం ప్రథమ చికిత్స అందజేసి మెరుగైన వైద్యం కోసం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సి వై.లక్ష్మణరావు తెలిపారు.

పెద్దబమ్మిడిలో బైక్ దగ్ధం

కోటబొమ్మాళి : మండలంలోని పెద్దబమ్మిడికి చెందిన కోన సంతోష్ తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి వద్ద పార్కు చేసి ఇంట్లో నిద్రిస్తుండగా... గురువారం వేకువజామున దుండగులు నిప్పంటించారు. ఈ ప్రమాదంలో బైక్ పూర్తిగా దగ్ధమైంది. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామానికి చెందిన చల్లా లక్ష్మణరావు, సిమ్మ నారాయణరావులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ విశ్వేశ్వరరావు తెలిపారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

నాడు-నేడుతో ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి చేస్తూ... విద్యారంగంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిని సారించారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు-నేడులో భాగంగా రూ.70 లక్షలతో భవనాల ఆధునికీకరణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగం ప్రగతి పథంలో ప్రయాణిస్తుందన్నారు. పాఠశాలలు ఆధునికీకరణ చేయడంతో పేద విద్యార్థులు సర్కారీ బడుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. విద్యాకానుక, వసతి దీవెన, అమ్మఒడి, విద్యాదీవెన, గోరుముద్ద వంటి పథకాలతో ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి కోట్ల ప్రకాశరావు, ప్రిన్సిపాల్ జె.సునీత, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, ఎపిఎం గురుగుబెల్లి శ్యామలరావు, పిఎసిఎస్ సభ్యులు శేషగిరి, ఆనందరావు, మల్లేశ్వరరావు గుడ్ల మోహనరావు పాల్గొన్నారు.

వైసిపిలో 25 కుటుంబాలు చేరిక

పొందూరు మేజర్ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపేటకి చెందిన 25 కుటుంబాలు వైసిపిలో చేశారు. వారికి స్పీకర్, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, సర్పంచ్ రేగడి లక్ష్మి, పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, వైస్ ఎంపిపి ప్రతినిది వండాన వెంకటరావు, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు గుడ్ల మోహనరావు పాల్గొన్నారు.


ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

ఈ నెల 12న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నం పర్యటనను విజయవంతం చేయాలని స్పీకర్ వైసిపి నాయకులకు పిలుపునిచ్చారు. పొందూరు స్పీకర్ క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. రూ.12 వేల కోట్లతో వివిధ పనులకు శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.


పొందూరు : శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ సీతారాం

'నాడు-నేడు' పనులకు శంకుస్థాపన

కొత్తూరు : మండలంలోని కుంటిభద్ర, నివగాం గ్రామాల్లోని మండల ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు-నేడులో భాగంగా రూ.29 లక్షలతో భవన ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే నివగాం జూనియర్ కళాశాలలో తాగునీటి బోరుకు, మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.ఎల్.ఎన్.ఉదయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కె.భాగ్యవతి, పిఎసిఎస్ అధ్యక్షులు చింతడ సూర్యనారాయణ, వైసిపి నాయకులు గోగుల వరప్రసాదరావు నాయుడు, జి.ఆనందరావు, బి.శ్రీను, పి.రామారావు నాయుడు, కె.త్రినాథరావు, ఎపిఎం త్రినాథమ్మ పాల్గొన్నారు.


ధర్మానకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సువర్ణ

గ్రంథాలయ వారోత్సవాలకు ఆహ్వానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి నిర్వహించనున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు ఆహ్వానించారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ సువ్వారి గాంధీ పెద్దపాడులోని మంత్రి క్యాంప్ కార్యాలయానికి గురువారం ఆహ్వాన పత్రికను అందజేశారు. అలాగే కలెక్టరేట్‌లోని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జెసి ఎం.నవీన్‌ను, ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్.రాధికలను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఆమెతో పాటు వైసిపి నాయకులు సువ్వారి సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సెక్రటరీ కుమార్ రాజాలు ఉన్నారు.


రూ.లక్ష విరాళం అందజేస్తున్న రామారావు

పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని చిన్నబాడాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వజ్రపుకొత్తూరు మండలం మహదేవపురం గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి తమ్మినాన రామారావు పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. మల్లా కామేశ్వరరావు రూ. 15 వేలు విలువ చేసే క్రీడా దుస్తులు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉప్పాడ రమేష్, తమ్మి ఎర్రన్న, గున్న శంకరరావు, పాఠశాల హెచ్ఎం కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సోంపేట: మండలంలోని బారువ డిగ్రీ కళాశాలలో ఎంపీ ల్యాండ్ నిధులతో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులకు గురువారం స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ మంజూరు చేసిన రూ.ఐదు లక్షల నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమార్, అధ్యాపకులు దున్న సత్యం, రాజేష్ ఖన్నా, నాయకులు మద్దిల నాగేశ్వరరావు, సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అందుబాటులో మినప, పెసర విత్తనాలు

బూర్జ : మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రాయితీపై మినప, పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఎఒ ఎ.రాజేశ్వరరావు తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని ఆర్‌బికెల్లో పది క్వింటాళ్ల మినుములు, ఆరు కింటాళ్ల పెసలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మినప విత్తనాలు నాలుగు కేజీలు బ్యాగు కేజీ రూ.114 కాగా, రూ.34 సబ్సిడీ పోనూ కేజీ రూ.80కే వస్తుందన్నారు. అలాగే పెసర కేజీ రూ.116 కాగా, రూ.34 సబ్సిడీ పోనూ రూ.82కే అందుబాటులో ఉంటుందన్నారు. రైతులు సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మూడు రాజధానులతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మూడు రాజధానులతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నాన్ పొలిటికల్ జెఎసి చైర్మన్ గుంట తులసీరావు అన్నారు. స్థానిక రాయల్ కళ్యాణ మండపంలో టెక్కలి నియోజకవర్గస్థాయి విశాఖ పరిపాల రాజధానిగా చర్చి వేదిక గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి నరసన్నపేట ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు, ఉత్తరాంధ్ర వెనుకబడి ప్రాంతంగా ఉండడంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి శ్రీకాకుళం, విశాఖపట్నం పరిపాలన రాజధానిగా ఏర్పాటు చేస్తామంటే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్ష నాయకులు ఉత్తరాంధ్ర ద్రోహులుగా చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఇప్పటికైనా ఉత్తరాంధ్ర అభివృద్ధికి విశాఖ పరిపాలన రాజధానిగా కావాల్సిన ఎంతైనా ఉందన్నారు. ప్రతిఒక్కరూ విశాఖపట్నం పరిపాలన రాజధానిగా ఏర్పాటు దిశగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నం పరిపాలన రాజధానిగా చేయాలని చర్చా వేదిక తీర్మానం చేశారు. కార్యక్రమంలో పేడాడ పరమేశ్వరరావు, నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృపారాణి

తేలినీలాపురంపై 'ఐతమ్' విద్యార్థుల అధ్యయనం


గ్రామస్తులతో మాట్లాడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల మొదటి ఏడాదికి చెందిన 60 మంది విద్యార్థులు 'ఉన్నత్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా విదేశీపక్షులు విహార కేంద్రమైన టెక్కలి మండలంలోని 'తేలినీలాపురాన్ని' గురువారం సందర్శించారు. గ్రామంలోని వసతులు, విద్యుదీకరణ, ఇతర మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై గ్రామస్తులతో మాట్లాడి విద్యార్థులు అధ్యయనం చేశారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తిలు విద్యార్థుల పర్యటనకు తగిన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏకాభారత్ శ్రేష్ఠభారత్ నోడల్ అధికారి ఎస్.భాస్కరబాబు, శాక్ ఇన్‌స్పెక్టర్ జె.సురేష్ కుమార్, అధ్యాపక బృందం విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు.

ఘనంగా 'సోమంచి' జయంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రాచీన జ్యోతిష్య పండితులు, ఉత్తరేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపకులు సోమంచి కోదండరామయ్య 142వ జయంతి వేడుకలను నగరంలోని పిఎన్ కాలనీలో ఉన్న బ్రాహ్మణ భవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముందుగా కోదండ రామయ్య చిత్ర పటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. విద్యావేత్తగా, వ్యాపార వేత్తగా ఎన్నో విజయాలు సాధించిన సోమంచి కోదండరామయ్య అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సోమంచి వెంకటరమణమూర్తి, వెంకటేశ్వర్లు, ఇతర కటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కుటుంబసభ్యులు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- కవిటి

ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. ఇటీవల శ్రీకాకుళంలో నిర్వహించిన స్కూల్ ఫెడరేషన్ క్రీడల్లో షటిల్ పోటీలో బెందాలం మణికంఠ, పొల్లాయి నరేష్, సాఫ్ట్ బాల్ విభాగంలో పండి అవినాష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బెందాలం మల్లేశ్వరరావు, స్కూల్ కమిటీ అధ్యక్షుడు ఎం.కృష్ణారావు, పొల్లాయి లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కవిటి : ట్రోఫీతో విద్యార్థులు

ఇచ్ఛాపురం : గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన జిల్లా స్థాయి టైక్వాండో పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు డి.వి.త్రినాథరావు తెలిపారు. ఈ మేరకు వారికి అభినందనలు తెలియజేశారు. అండర్-14 విభాగానికి సిహెచ్.గిరి, ఎన్.ఢిల్లీరావు, అండర్-17 విభాగానికి ఎన్.భగవాన్, ఎస్.లిజ్జు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కోచ్ దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంచిలి: త్వరలో నిర్వహించనున్న జిల్లాస్థాయి క్రీడా పోటీలకు కంచిలి ఉన్నత పాఠశాల నుంచి 13 మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం నాయుడు తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో ఎంపికైన విద్యార్థులను లో ఎంఇఒ ఎస్.శివరాంప్రసాద్ గురువారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాకీ అండర్-17 విభాగంలో ఎ.రఘు, పి.సుస్మిత, ఉషస్విని, అండర్-14 విభాగంలో కె.లావణ్య, జి.దీక్షిత, కె.తులసి, జి.హేమంత్, జి.హృతిక్, త్రోబాల్ అండర్-17 విభాగంలో ఎం.సతీష్, 14 విభాగంలో ఎస్.మణికంఠ, ఐ.గోవిందులు ఎంపికైనట్లు తెలిపారు. వీరితోపాటు స్టాండ్ బై క్రీడాకారుడుగా ఎన్.పవన్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమం పిఇటి, ఉపాధ్యాయులు రోజారాణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సైన్స్‌తోనే అభివృద్ధి

ప్రజాశక్తి- టెక్కలి

సమాజంలో సైన్స్ వినియోగం పెరిగిన తర్వాత అభివృద్ధి సాధ్యమైందని, సైన్స్ ద్వారానే మరింత అభివృద్ధి సాధిస్తామని స్థానిక ఓక్లాండ్ ఇంటర్నేషనల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మల్లా మధులత అన్నారు. పాఠశాల ఆవరణలో ప్రపంచ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రాజెక్టుల నమూనాలను గురువారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు పలువురుని అబ్బురపరిచాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

13న వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని నీలావతి గ్రంథాలయంలో ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక (యువివి) ఆధ్వర్యాన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నమని ఉద్దాన విద్యాభివృద్ధి వేదిక అధ్యక్ష, కార్యదర్శులు ఇసాకోటి జోగారావు, బొడ్డు చిన్నారావు ఒక ప్రకటనలో తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొవాలన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి- పలాస

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధికారులకు ఆదేశించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో హౌసింగ్, సచివాలయం అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్దిదారులకు త్వరగా బిల్లులు అందేలా చూడాలని, పనులు ప్రారంభించని లబ్దిదారులతో పనులు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర బుజ్జి, తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు, మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, కౌన్సిలర్లు, హౌసింగ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

ఇచ్ఛాపురం : డిసెంబరు 21 నాటికీ ప్రతి లబ్ధిదారునికీ జగనన్న ఇళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు అధికారి మల్లేశ్వరరావు సూచించారు. స్థానిక మెప్మా కార్యాలయంలో రిసోర్స్‌పర్సన్, మెప్మా సిబ్బంది ఇళ్ల నిర్మాణాలపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు గురించి లబ్దిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్దిదారులకు అవసరాలు తెలుసుకుని సహకారం అందించాలన్నారు. బిల్లుల చెల్లింపు ఎటువంటి సందేహం వద్దని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాలపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మెప్మా మేనేజర్ జానకి రామారావు, సిఒలు బాలరాజు, సంతోష్, రాము పాల్గొన్నారు.


పలాస : సమీక్షిస్తున్న చైర్మన్ గిరిబాబు

కారుణ్య నియామక పత్రం అందజేత



జ్యోత్స్నకు నియామక పత్రం అందజేస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపాలిటికి చెందిన గొద్దు జ్యోత్స్నకు ఇరిగేషన్ శాఖలో కార్యాలయంలో సబార్డినేట్‌గా కారుణ్య నియామకం కింద ప్రభుత్వం నియమించింది. ఈ నియామక పత్రాన్ని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం గురువారం జ్యోత్స్నకు అందజేశారు. ఈమె తండ్రి గొద్దు శ్రీనివాసరావు గతంలో ఇరిగేషన్ శాఖలో ఉద్యోగిగా పని చేసేవారు. ఆయన హఠాన్మరణం చెందడంతో ఆయన సతీమణి రాజేశ్వరికి అదే శాఖలో కారుణ్య నియామకం కింద అప్పట్లో ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పించింది. కొన్నాళ్ల క్రితం ఆమె కూడా మృతి చెందడంతో వారిరువురి ఏకైక కుమార్తె జ్యోత్స్న నియామకంలో భాగంగా ఉద్యోగ కల్పనకు రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. అప్పట్లో ఆమె మైనర్ కావడంతో ఆమె విన్నపాన్ని అధికారులు తిరస్కరించారు. ఇటీవల జ్యోత్స్నకు ఉద్యోగ అర్హతకు సంబంధించిన వయసు నిండడంతో ఆమె కుటుంబీకులు స్పీకర్‌ను ఆశ్రయించారు. జ్యోత్స్న కుటుంబ ఆర్థిక పరిస్థితిని స్పీకర్ సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కారుణ్య నియామకంలో భాగంగా ఆ యువతికి ఉద్యోగం కల్పించాలని సిఎం జగన్ కలెక్టర్‌కు ఆదేశించారు. దీంతో జ్యోత్స్నకు ఇరిగేషన్ శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సోమరాజు జగన్నాథం, వైసిపి నాయకుడు నక్క కన్నబాబు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో మెరుగైన ఆరోగ్యం



మాట్లాడుతున్న సుబ్రమణ్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

స్వచ్ఛమైన ప్రకృతి సేద్యంతో లభించే ఆకుకూరలు, కూరగాయలు, పళ్లు, చిరుధాన్యాలను ఆహారంగా చేసుకుంటే ఆరోగ్యంగా జీవించడం సాధ్యమవుతుందని పలాసకు చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ లండ సుబ్రమణ్యం అన్నారు. వజ్రపుత్తూరు హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర పండా అధ్యక్షతన గురువారం నిర్వహించిన ఆరోగ్యమే మహాభాగ్యం సదస్సులో పాల్గొన్నారు. ప్రస్తుతం పట్టిపీడిస్తున్న మధుమేహం, బిపి థైరాయిడ్, గ్యాస్ట్రిక్ సమస్య, స్త్రీల సమస్యలు వంటి వాటికి ప్రకృతిలో లభించే ఔషధాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యానికి మించిన సంపద ఏమీ లేదని, అనారోగ్యం బారినపడి లక్షల రూపాయలు వెచ్చించడం కన్నా వ్యాధులు రాకుండా నివారించుకోవడం అవసరమని విద్యార్థులకు వివరించారు. ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవనవిధానంలో ప్రకృతి వైద్యంపై అవగాహనతో మెరుగైన జీవితానికి దారి చూపుతుందని ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర పండా అన్నారు. అనంతరం సుబ్రహ్మణ్యంను హెచ్ఎం, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వాసుదేవరావు దుశ్శాలువ కప్పి సన్మానించారు.



మాట్లాడుతున్న శిరీష

టిడిపి పూర్వ వైభవానికి కృషి

ప్రజాశక్తి- పలాస

టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయం ఆవరణలో గురువారం నియోజకవర్గ స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలు గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గ్రామస్థాయిలో కార్యకర్తలను బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి లోడగల కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పిరికట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బి.నాగరాజు, సప్ప నవీన్, సూరాడ మోహనరావు పాల్గొన్నారు.



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న విద్యార్థులు

విపత్తుల నిర్వహణపై మాక్‌డ్రిల్

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విపత్తుల నిర్వహణపై గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. జపాన్ ప్రభుత్వ సహకారంతో ఫ్రైజ్ వాటర్ హౌస్ కూపన్ సభ్యులు అంజన మాధవన్, క్రథి గార్గ్ ఆధ్వర్యాన విద్యార్థులకు మెలకువలు వివరించారు. సునామి విపత్తు నిర్వహణలో భాగంగా యుఎన్‌డిపి ఆధ్వర్యా దేశంలో విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా సముద్ర తీర ప్రాంతమైన ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధ, గురువారాల్లో శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ తరగతుల్లో తుపాన్లు, సునామీ వంటి ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆపదలో ఉన్నవారిని ఏ విధంగా ఆదుకోవాలి అనే అంశాలను మాక్ డ్రిల్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒ ధనుంజయ మజ్జి, ప్రధానోపాధ్యాయుడు మురళీప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులు వేగవంతం

ప్రజాశక్తి- ఆమదాలవలస

నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంఇఒ దుప్పల రామారావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలన్నారు. ప్రాజెక్టుల వారీగా సమాంతరంగా పనులు జరగాలని ఆదేశించారు. బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని సూచించారు. పనులు పూర్తయిన వాటికి బిల్లులను వెంటనే మంజూరు చేయాలని తెలిపారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.రేణుక, ఎపిఎం పైడి కూర్మారావు, నాడు-నేడు ఎఒ కె.రామారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'ఉపాధి'



వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

వజ్రపుకొత్తూరు : మండలంలోని జాబ్‌కార్డు దారులందరికీ ఉపాధి పని కల్పించాలని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి హామీపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల నుంచి వలసలు నివారణకు ఉపాధి హామీ ముఖ్య ఉద్దేశం అన్నారు. మండలంలో వచ్చే వారం నుంచి పనులను కల్పించాలన్నారు. ఇప్పటికే ఇతర మండలాల్లో పనులు ప్రారంభమయ్యాయని, ఇక్కడ మాత్రం పనులు ప్రారంభం కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాత పనులు పూర్తి చేసిన తరువాత కొత్త పనులు కల్పించాలని సూచించారు. కూలీలకు పనులు కల్పించడంలో అలసత్వం పనికిరాదన్నారు. సమావేశంలో ఎపిడి మురళీకృష్ణ, ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, ఎపిఒలు శ్రీనివాసరావు, కేశవరావు, జెఇ హరినాథ్, సిటిఎ నరసింహ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని ప్రతి పంచాయతీలోనూ ఉపాధి హామీ పనులు నిర్వహించాలని ఎపిఒ రవి సూచించారు. మెళియాపుట్టి ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమావేశానికి హాజరుకాని క్షేత్ర సహాయకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో నూతన పనులను గుర్తించాలన్నారు. జలదూత్ ద్వారా బావుల స్థితిగతులు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఇసి ఆదినారాయణరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రోగుల చెంతకే వైద్యం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంతో రోగుల చెంతకే వైద్య సేవలు అందుతున్నాయని మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోయిన నాగేశ్వరరావు, సర్పంచ్ కాళ్ల సంజీవరావులు అన్నారు. కోటబొమ్మాళిలోని సచివాలయం వద్ద నిమ్మాడ పిహెచ్‌సి వైద్యులు మద్ది నితీష్‌కుమార్, బి.మేఘనలు ఫ్యామిలీ ఫిజీషన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే గ్రామీణులు చిన్న అనారోగ్యానికి పిహెచ్‌సికి వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంతూరులోనే వైద్య సేవలు పొందేలా సిఎం జగన్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. అనంతరం 200 మంది రోగులను వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్.యోగేశ్వరరావు, వార్డు మెంబర్ బోయిన కృష్ణారావు, 104 సిబ్బంది ఎం.రామారావు, సిహెచ్.సూర్యనారాయణ, అశావర్కర్లు, ఎఎన్ఎంలు, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

25 'చలో ఢిల్లీ'

నరసన్నపేట : దేశవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలించాలని కోరుతూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఆధ్వర్యాన నవంబరు 25న చలో ఢిలీ-పార్లమెంట్ మార్చ్‌ను నిర్వహిస్తున్నామని రాష్ట్ర సహాయ కార్యదర్శి మోజ్జాడ యుగంధర్, శ్రీనివాసరావు కోరారు. మండల కేంద్రంలోని ఎస్‌సి హాస్టల్లో చలో ఢిల్లీ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్టును అమలు చేయాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 27 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యావ్యవస్థను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే ప్రయత్నం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యువకులు ధనరాజ్, కార్తీక్, సిద్ధు, ఢిల్లీశ్వర్, ప్రభాస్, సందీప్, చిరంజీవి పాల్గొన్నారు.

టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షునిగా సవరయ్య



సవరయ్య

జి.సిగడాం : మండలంలోని గెడ్డకంచరాంకు చెందిన డొంక సవరయ్యను ఎచ్చెర్ల నియోజకవర్గం ఎస్‌సి సెల్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన భార్య డొంక సూర్యుడమ్మ గతంలో ఎంపిపిగా పనిచేశారు. టిడిపిలో క్రియాశీల రాజకీయాల్లో ఉంటున్నారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతున్నారు. దీంతో మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావుకు అభినందనలు తెలియజేశారు. ఈయన ఎంపికపై గెడ్డకంచరాం సర్పంచ్ పంచిరెడ్డి లలితకుమారి, ఉప సర్పంచ్ మారుపల్లి రాము, అడ్వకేట్ నక్క మురళి, శ్యామ్ అభినందనలు తెలిపారు.



నూతన వైర్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నూతన విద్యుత్ వైర్లు ఏర్పాటు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చొరవతో విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయడంతో మరువాడ పంచాయతీలో విద్యుత్ సమస్య పరిష్కారమైందని వైసిపి ఇన్‌ఛార్జి గంట ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు నూతన వైర్లను విద్యుత్ లైన్‌మెన్లు గురువారం వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్ వైర్లు తుప్పు పట్టడంతో నిరంతరం సరఫరాకు అంతరాయం ఏర్పడేదన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, విద్యుత్‌శాఖ ఎఇ ఎం.శివకుమార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు స్పందించి నూతన వైర్లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గంట జనార్ధనరావు, మేరుగు పాపారావు, గంట కుమార్, లైన్‌మెన్ రవికుమార్, జెఎల్ఎం హేమసుందర్, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ దీనమణి

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- సోంపేట

సురక్షిత బ్యాంకింగ్ లావాదేవీలపై సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన స్థానిక డిసిసిబి బ్యాంకు మేనేజర్ దీనమణి జాతీయ సమగ్రపై వివరించారు. సైబర్ నేరాలు, ఆర్థిక లావాదేవీలు జరిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు సూపర్‌వైజర్ మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ హరిప్రసాద్, ఎన్ఎస్ఎస్ పిఒలు రామినాయుడు, ఎం.ప్రసాద్, అధ్యాపకులు ప్రవీణ్, శ్రావణ్ కుమార్, యుగంధర్, వెంకటరావు, నారాయణ, భవిత, సంధ్యారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ సరోజని

పక్కాగా భూ రికార్డులు

మెళియాపుట్టి: భూములకు సంబంధించి రికార్డులు పక్కాగా ఉండాలని తహశీల్దార్ పి.సరోజిని సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండోమెంట్, ల్యాండ్ సీలింగ్, డీపట్టా తదితర రికార్డులన్నీ ఎటువంటి లోపాలు లేకుండా సక్రమంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిటి శంకరరావు, ఆర్ఐ వైకుంఠరావు, విఆర్ఒలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ కార్డుల పంపిణీ

పలాస: పలాస మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు హెల్త్ కార్డులను మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులకు ఎటువంటి అనారోగ్యం పాలైన హెల్త్ కార్డులను ద్వారా ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజగోపాల్, బొడ్డేపల్లి శ్రీను, వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ సిహెచ్.మురుగన్, రవి, ఈశ్వర్, సతీష్ పాల్గొన్నారు.



హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్న గిరిబాబు

తాగునీరు, పారిశుధ్య కమిటీల ఏర్పాటు



మాట్లాడుతున్న వెంకటరావు

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని పెద్దకొజ్జిరియా, మకరాంపురం పంచాయతీల్లో గురువారం నీరు, పారిశుధ్య కమిటీలను ఏర్పాటు చేశారు. స్థానిక సర్పంచ్‌ల అధ్యక్షతన జలజీవన మిషన్ గ్రామ సభలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీం లీడర్ జె.వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ నీరు, పారిశుధ్య నిర్వహణకు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జలజీవన్ మిషన్లో భాగంగా ఇంటింటికీ సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా ఈ కమిటీల ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సర్పంచ్ అధ్యక్షులుగా, కార్యదర్శి కోశాధికారిగా ఈ కమిటీలు పనిచేస్తాయన్నారు. ఇంటింటికీ కులాయిలు ఏర్పాటు చేసి, పంచాయతీ తీర్మానం ప్రకారం నామమాత్రపు నీటి పన్ను వసూలు చేస్తామన్నారు. పంచాయతీ పరిధిలో వ్యక్తిగత అకౌంట్లు సైతం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఝాన్సీ, ఢిల్లీరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం పాల్గొన్నారు.

మత్స్యకార సహకార సంఘం అధ్యక్షునిగా అప్పారావు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బెజ్జిపురంలో స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టి.శశిభూషణరావు, శారద ఎన్నికల అధికారుల అధికారులుగా వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా కదుపురి అప్పారావు, ఉపాధ్యక్షునిగా నివగాపు సూర్యనారాయణ, కార్యదర్శిగా లుట్ట సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా మరో ఆరుగురు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గాన్ని మాజీ ఎంపిపి డి.రాజినాయుడు, ఇజ్జడా వెంకటరమణ, ఆశిరప్పడులు అభినందనలు తెలిపారు.



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న రాజినాయుడు

ప్రభుత్వ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న మేనేజర్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- బూర్జ

ప్రభుత్వ పథకాలపై మహిళా సంఘాల సభ్యులు అవగాహన కలిగి ఉండాలని ఎపిజివిబి మేనేజర్ సిహెచ్.కిరణ్‌కుమార్, ఐకెపి ఎపిఎం రాములు అన్నారు. బూర్జలో ఎపిజివిబి బ్యాంకు ఆధ్వర్యాన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు వైఎస్ఆర్ సున్నా వడ్డీపై రుణాలను అందజేస్తుందన్నారు. ప్రతి మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యులు సమావేశాలకు హాజరై అవగాహన పెంచుకోవాలన్నారు. సమావేశంలో సతీష్, సిఎఫ్‌లు పాల్గొన్నారు.

విఆర్‌ఒలకు ఉద్యోగోన్నతి కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఒలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిఒ నంబరు 154 ప్రకారం అర్హులైన గ్రామ రెవెన్యూ అధికారులకు గ్రేడ్-1 నుంచి సీనియర్ సహాయకులుగా ఉద్యోగోన్నతి కల్పించాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరు కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీకేష లాఠకర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60,40 నిష్పత్తిలో ఉద్యోగోన్నతులు కల్పించాల్సి ఉన్నా, నాలుగు పోస్టులు మాత్రమే ఇచ్చారన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు ఉద్యోగోన్నతులు లేక ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎపి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కళాంజలి థియేటర్‌ను మూసివేయాలి

పొందూరు: పొందూరు మండల కేంద్రంలో పంచాయతీ అనుమతులు, ఇతర అనుమతులు లేకుండా నడుపుతున్న కళాంజలి సినిమా థియేటర్‌ను అధికారులు తక్షణమే మూసివే యించాలని టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగాన యకులు, ఎఎంసి మాజీ చైర్మన్ అన్నెపు రాము, టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి డిమాండ్ చేశారు. పొందూరు మండలంలోని కింతలిలో గురువారం విలేకరులతో మాట్లాడారు. పదేళ్లగా పంచాయతీకి పన్ను చెల్లించకుండా థియేటర్‌ను నడుపుతుంటే... కార్యదర్శి ఎసి నిర్వాహణకు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులైతే అనుమతులు అవసరం ఉండదా? అని ప్రశ్నించారు. అవసరమైన పత్రాలు లేకపోయినా ఎసి నిర్వాహణకు అనుమతులిచ్చిన కార్యదర్శి, థియేటర్ నడుపుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోని కోరారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నమ్రతాప్రియ

ప్రజాశక్తి- ఆమదాలవలస

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని పట్టణంలోని మోణింగివారి వీధి అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి బి.నమ్రతాప్రియ అన్నారు. ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేసి నెల రోజులకు సరిపడా మందులను వారికి అందజేశారు. అనంతరం పట్టణంలోని మెట్టెక్కివలసలోని భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన సత్యసాయి అమృత ఆహార పథకంలో భాగంగా 80 మంది గర్భిణులకు భోజనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్, జోనల్ కన్వీనర్ ఎ.గజపతిరావు, మునగవలస రవీంద్రబాబు, వైద్యులు పూసర్ల తాతయ్యలు, ఫార్మసిస్టు చింతాడ వరుణ్ కుమార్, మహిళా కో-ఆర్డినేటర్ ఎ.రామలక్ష్మి, వి.కృష్ణారావు, కె.ప్రహ్లాదరావు, స్టాఫ్‌నర్సులు ఫాల్గుణరావు, సంతోష్‌కుమార్, డేటాఎంట్రీ ఆపరేటర్ హేమంత్, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి తేజాచక్రవర్తి

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- సందిగాం

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉంటే సమాజంలో ప్రశాంతంగా జీవించవచ్చునని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి తేజాచక్రవర్తి మల్ల అన్నారు.

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు చట్టాలపై గురువారం అవగాహన కరల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.ధర్మరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.ధర్మారావు, ప్రధానోపాధ్యాయులు వై.ధర్మారావు పాల్గొన్నారు.